

పోస్టర్ ఆవిష్కరిస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

రేపు ఆల్ ఇండియా బిల్డర్స్ కన్వెన్షన్

- హైదరాబాద్ వేదికగా అధునాత టెక్నాలజీపై చర్చలు
- హైటెక్స్‌లో ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 31వ ఆల్ ఇండియా బిల్డర్స్ కన్వెన్షన్- 2024 ఈ నెల 27 నుంచి నిర్వహించనున్నట్టు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ప్రకటించింది. హైదరాబాద్ వేదికగా జరిగే కన్వెన్షన్ ఈ నెల 29 వరకు జరుగుతుందని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) జాతీయ అధ్యక్షుడు ఎస్.ఎన్. రెడ్డి, బీఏఐ మాజీ జాతీయ అధ్యక్షుడు బొల్లినేని శీనయ్య, రాష్ట్ర అధ్యక్షుడు కె.దేవేందర్ రెడ్డిలు తెలిపారు. హైటెక్స్‌లోని న్యాక్ క్యాంపస్‌లో బీఏఐ, ఏబీసీ నిర్వాహకులు ఆల్ ఇండియా బిల్డర్స్ కన్వెన్షన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్ ఇండియా సదస్సును సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని, గౌరవ అతిథులుగా మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు హాజరవుతున్నారని తెలిపారు. మూడు రోజులపాటు 800వందల మందికిపైగా ప్రతినిధులు హాజరవ్వనుండగా, ఈ సదస్సులో నిర్మాణ రంగంలో అధునాతన టెక్నాలజీ వంటి పలు అంశాలపై సెమినార్లు, టెక్నికల్ సెషన్స్ ఉంటాయని తెలిపారు. ఎగ్జిబిషన్, వర్క్‌షాప్స్, అధునాతన నిర్మాణ పరికరాలను, నిర్మాణ మెటీరియల్ వంటి విషయాలపై చర్చలుంటాయని వివరించారు. సమావేశంలో సదస్సు కార్యదర్శి సచ్చిదానంద రెడ్డి, బీఏఐ మెంబర్స్ కమిటీ చైర్మన్ డి.వి.ఎస్ రెడ్డి, హైదరాబాద్ సెంటర్ చైర్మన్ భూపేందర్ సింగ్, కన్వెన్షన్ వైస్ చైర్మన్ బల్మూరి సుగుణాకర్ రావు, కన్వెన్షన్ ఫైనాన్స్ కమిటీ చైర్మన్ సంకినేని కృష్ణారావు, కోశాధికారి నరేందర్ రెడ్డి, కన్వెన్షన్ జాయింట్ సెక్రటరీ వి.సుధాకర్‌లతోపాటు మెమెంటోస్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, ఫుడ్ కమిటీ వి.భాస్కర్ రెడ్డి, రిజిస్ట్రేషన్ కమిటీ జి.సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూకు అ'పూర్వ' బహుమతి

- రూ. 20 లక్షల విలువైన త్రీడీ ప్రింటింగ్ మిషనరీ విరాళం
- దాతృత్వం చాటుకున్న పూర్వ విద్యార్థి రాజ్‌కుమార్


పూర్వవిద్యార్థి రాజ్‌కుమార్‌ను సత్కరిస్తున్న జేఎన్‌టీయూ వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్ తదితరులు

హైదరాబాద్ సిటీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకు పూర్వ విద్యార్థి కాటూరు ఫణిరాజ్‌కుమార్ అపూర్వమైన బహుమతిని ఇచ్చారు. సుమారు రూ. 20 లక్షల విలువైన త్రీడీ ప్రింటింగ్ మిషనరీని విరాళంగా అందజేశారు. ఈ మిషనరీతో జె-హబ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన త్రీడీ ప్రింటింగ్ ల్యాబ్‌ను వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ.. త్రీడీ ప్రింటింగ్ మిషనరీతో క్యాంపస్ కాలేజీ విద్యార్థులకు, టీచింగ్ ఫ్యాకల్టీకి అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఇటీవల అమెరికా పర్యటనలో తనను కలిసిన రాజ్‌కుమార్‌తో కాలేజీకి త్రీడీ ప్రింటింగ్ మిషన్ అవసరముందని చెప్పానని, అతను వెంటనే అంగీకరించారని పేర్కొన్నారు. ఇచ్చినమాట ప్రకారం మిషనరీని కాలేజీకి అందజేసిన ఫణి రాజ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఫణి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. తన సంపాదనలో 85శాతం విద్యా, ఆరోగ్యం, పేదలకు సహాయం చేయడానికే వినియోగిస్తున్నానని చెప్పారు. రెక్టార్ గోవర్ధన్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు యూనివర్సిటీకి మూల స్తంభాల్లాంటి వారని చెప్పారు. రిజిస్ట్రార్ మంజూర్ హుస్సేన్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో కొన్ని కొత్త సౌకర్యాలు, కొత్త పరికరాలు అందుబాట్లోకి వస్తున్నాయని, త్రీడీ ప్రింటింగ్ మిషనరీతో మరొక ఆధునిక సదుపాయం లభించినట్లయిందన్నారు.

హెల్త్‌కేర్ కేంద్రంలో అధికారుల తనిఖీ

- నకిలీ టాబెట్లు, క్యాప్సూల్స్ స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ప్రశాంతినగర్‌లో ఉన్న ఎస్ఎల్ హెల్త్‌కేర్ కేంద్రంలో ఔషధ నియంత్రణ అధికారులు బుధవారం తనిఖీలు చేసి నకిలీ మందులను స్వాధీనం చేసుకున్నారు. ఫుడ్ లైసెన్స్ నిబంధనల కింద (గ్లూకోసమైన్, మిథైల్ సల్ఫోనిల్ మిథేన్, డయాసెరిన్) టాబ్లెట్లు, (ప్రీగాబాలిన్, మిథైల్ కోబాలమిన్) క్యాప్సూల్స్ నకిలీగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఉత్పత్తులకు సంబంధించిన సేల్ ఇన్‌వాయిస్‌లు, స్టీరియోలు, ప్రింటెడ్ అల్యూమినియం ఫాయిల్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా వారు తయారు చేసిన ఉత్పత్తులను న్యూట్రాస్యూటికల్స్‌గా మార్కెట్లోని మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్నట్టు అధికారులు గుర్తించారు.


చిన్నారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

కూచిపూడిలో చిన్నారి ప్రతిభ

హైదర్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన మానసడాన్స్ ఆఫ్ అకాడమీ తరుపున అండమాన్‌లో కూచిపూడి నృత్యం ప్రదర్శించి నేషనల్ అవార్డును సాధించిన ప్రదీక్షను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అభినందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ ఎమ్మెల్యే చేతులమీదుగా చిన్నారికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్‌లో మరిన్ని దేశాల్లో ప్రదర్శించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురువాలని ఆకాంక్షించారు.

గురుకుల పాఠశాల, కళాశాల పరిశీలన

హైదర్‌నగర్: హైదర్‌నగర్‌లో బాలానగర్ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాల, కళాశాలలో ఉన్న వసతులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గురుకుల పాఠశాల నిర్మాణం కోసం దూలపల్లిలో మరో రెండున్నర ఎకరాలు కేటాయించామన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు, దుప్పట్లు అందజేశారు.

ఇద్దరి అరెస్టు

అల్లాపూర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రామ మందిర ప్రారంభం నేపథ్యంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే ఉద్దేశంతో కాషాయ జండాను తగుల బెట్టారన్న ఆరోపణలపై ఇద్దరు నిందితులను అల్లాపూర్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఏసీపీ కూకట్‌పల్లి డివిజన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం మీరట్, ఫైహల్లాపూర్, పహెల్వాన్ నగర్‌కు చెందిన మహమ్మద్ ఫరాజ్(23), బంజారా హిల్స్ రోడ్ నెం.10కు చెందిన సయ్యద్ అబ్దుల్ షాబాజ్ అలియాజ్ ఛోటూ(28) హైటెక్ సిటీ సమీపంలోని ఎన్ఐఏ రోడ్‌లోని కారు మెకానిక్ షెడ్‌లో పనిచేస్తుంటారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఇతర మత జెండాలను తగలబెట్టాలని అనుకున్న ఇద్దరూ, గత 24న అర్ధరాత్రి 2గంటల సమయంలో అల్లాపూర్ డివిజన్ పర్వత్ నగర్ కూడలిలోని డివైడర్ మధ్య ఉన్న జెండాను బైక్‌పై వచ్చి తగలబెట్టారని పోలీసులు పేర్కొన్నారు. బాలనగర్ జోన్ డీసీపీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి ఏసీపీ శివభాస్కర్, అల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్, మన్సూర్ ఆలం, లక్ష్మప్ప, చిన్నయ్య బృందం ఈ కార్యాన్ని పూర్తి చేశారు. అత్యల్ప సమయంలో దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసినందుకు సిబ్బందిని డీసీపీ అభినందించారు.

కూల్చివేసినా కట్టేస్తున్నారు..


ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

- గోకుల్ ప్లాట్స్ పేరుతో హౌసింగ్‌బోర్డు స్థలం కబ్జా..
- రూ. 50 కోట్ల విలువైన స్థలం కబ్జాకు యత్నం
- జేసీబీలతో ఆక్రమణల తొలగింపు.. పలువురిపై కేసు నమోదు
- రెండు జిల్లాల రెవెన్యూ అధికారుల సర్వేతోనే ఆక్రమణలకు అడ్డుకట్ట

కోట్లు విలువ చేసే స్థలాలను కబ్జా చేసి, పిల్లర్లు వేసి భవనాలు కడుతున్నా పట్టించుకునే వారే లేరు. ఇంత జరుగుతున్నా కూడా ప్రజాప్రతినిధులు, అధికారులు సీరియస్‌గా దృష్టి కేంద్రీకరించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. రాజకీయ నాయకుల అండదండలతోనే కబ్జాదారులు రెచ్చిపోతున్నారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గోకుల్ ప్లాట్స్ పేరుతో సుమారు 50 కోట్ల రూపాయల విలువైన హౌసింగ్ బోర్డు స్థలాలను ఆక్రమించుకునే పనిలో కొందరు బడా బాబులు నిమగ్నమైనట్టు తెలుస్తోంది. కేపీహెచ్‌బీ తొమ్మిదోఫేజ్, గోకుల్ ప్లాట్స్ సాయిహిల్స్ మధ్యలో రాష్ట్ర ప్రభుత్వ అనుబంధంగా ఉన్న హౌసింగ్ బోర్డు స్థలం ఖాళీగా ఉంది. కూకట్‌పల్లి రెవెన్యూ విలేజ్ 1009 సర్వే నంబర్‌లో ప్రభుత్వ స్థలాలను హఫీజ్‌పేట్ రెవెన్యూ సర్వే నంబర్ 78 పేరుతో రివైజ్డ్ లే అవుట్ పేరుతో కొందరు కబ్జాదారులు తిష్టవేసి సొంతం చేసుకునే పనిలో నిమగ్నమైనట్టు సమాచారం.

ఆక్రమణల తొలగింపు.. ఇక అంతేనా?

హౌసింగ్‌బోర్డు స్థలంలో వెలిసిన ఆక్రమణలను గురువారం టీఎస్‌హెచ్‌బీ వెస్టన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వెంటనే ఎక్స్‌కవేటర్లతో ఆక్రమణలను తొలగించారు. సరిహద్దులు తొలగించడంతో ఎంత స్థలం కబ్జాకు గురైందనేది తెలియకపోయినప్పటికీ సుమారు 300గజాల్లో పిల్లర్లు వేసినట్టు గుర్తించి, వాటిని నేలమట్టం చేయించారు. దీన్ని హౌసింగ్‌బోర్డు అధికారులు స్వాధీనం చేసుకొని రక్షిస్తారా..? లేక ఆక్రమణలను తొలగించామని చెప్పి చేతులు దులుపుకుంటారా..? అనేది తెలియాల్సి ఉంది. సంక్రాంతి సెలవులకు ముందే కొంత స్థలం ఆక్రమణకు గురవుతుందని తెలిసినా అప్పట్లో తూతూ మంత్రంగా ఎక్స్‌కవేటతో ఆక్రమణలు తొలగించి వదిలేశారన్న విమర్శలు వెల్లవెత్తుతున్నాయి. అప్పుడే పక్కా ప్రణాళికతో ఉన్నతాధికారులకు నివేదించి అడ్డుకుంటే ఇవాల 600గజాల్లో పాగా వేసే వారా? అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.


ఆక్రమణకు గురవుతున్న స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈఈ కిరణ్‌బాబు

నగర నడిబొడ్డున రూ.50 కోట్ల స్థలం కబ్జా..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చెందిన హౌసింగ్ బోర్డు స్థలంలో రంగారెడ్డి జిల్లాకు చెందిన హఫీజ్‌పేట రెవెన్యూ విలేజ్ సర్వే నంబర్ 78 పేరుతో సుమారు 600 గజాలు ఆక్రమించుకొని నిర్మాణాలకు తెరలేపారు. ఇంతటితో ఆగకుండా రాళ్లు, మట్టితో మరికొంత స్థలం చదునుచేసి దాన్ని కూడా కబ్జా చేస్తారని పరిసర ప్రాంతాల్లో ఉంటున్న వారు చర్చించుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం కనీసం దానిపై దృష్టి సారించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. జీహెచ్ఎంసీ అయితే మాకు సంబంధం లేదన్నట్టుగా మిన్నకుండిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు జిల్లాలకు సంబంధించిన రెవెన్యూ అధికారులు వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిహద్దులు నిర్ణయిస్తే భవిష్యత్తులో ఆక్రమణలను అడ్డుకోవచ్చు.

పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాం

సంక్రాంతి పండగ సెలవుల్లో నిర్మాణాలు చేపట్టినట్టు ఉన్నారు. అంతకు ముందు పిల్లర్లను తొలగించాం. తాజాగా ఫిర్యాదు రావడంతో మరోసారి వెళ్లి అక్కడ ఉన్న 16 పిల్లర్లను తొలగించాం. అక్కడ ఆక్రమణల గురించి కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాం. ఆ స్థలం సర్వే చేసి, హద్దులు నిర్ణయించి అక్కడి పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

\- కిరణ్‌బాబు, డీఈఈ, టీఎస్‌హెచ్‌బీ

అక్రమ నిర్మాణాల కూల్చివేత

దుండిగల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ గ్రామంలోని సర్వేనంబర్ 170, 170/2లో అసైండ్ భూమిని ఓ కబ్జా దారుడు గ్రామస్థుల నుంచి కొనుగోలు చేసి అక్రమ నిర్మాణాలకు తెరలేపాడు. ఈ విషయం తెలిసిన తహసీల్దార్ సుచరిత అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని ఆర్ఐ భారతిని ఆదేశించారు. ఈ మేరకు ఆర్ఐ ఎక్స్‌కవేటర్ సాయంతో రెవెన్యూ సిబ్బంది అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. గతంలో కూడా ఎమ్మెల్సీ ఈ అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు రెండేళ్ల క్రితం నేలమట్టం చేశారు. కానీ కబ్జాదారులు గతంలో కూల్చివేసిన దాని పక్కనే ఉన్న మరో ఐదు ఎకరాలపై కన్నేశారు. అధికారులంతా అసెంబ్లీ ఎన్నికల విధుల్లో ఉండగా, మరో 200కు పైగా అక్రమ నిర్మాణాలు నిర్మించి ప్రజలకు విక్రయించి రూ. కోట్లు దండుకున్నారు. ఈవిషయం ఆలస్యంగా తెలిసిన రెవెన్యూ అధికారులు గురువారం దాదాపు 20 నిర్మాణాలను కూల్చివేశారు. ఇలాగే అక్రమ నిర్మాణలు కొనసాగితే కబ్జాదారులు ఎంతటి వారైనా ఉపేక్షించమన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే భూకబ్జా, పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయిస్తామని తహసీల్దార్ సుచరిత హెచ్చరించారు. శుక్రవారం జెండా వందనం ఉండడంతో మరుసటిరోజు పోలీసుల సహకారంతో మిగతా అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తామన్నారు. ప్రభుత్వ భూమిని ప్రజా అవసరాలకు ఉపయోగపడేలా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.


సర్వేనంబర్ 170లో ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేయిస్తున్న ఆర్ఐ

ప్రజల ప్రేమకు కృతజ్ఞుడను: వివేకానంద్


ప్రజలతో ఎమ్మెల్యే వివేకానంద్

జీడిమెట్ల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కృతజ్ఞత యాత్రలో భాగంగా 13వ రోజు ఎమ్మెల్యే వివేకానంద్ జగద్గిరిగుట్ట డివిజన్ దేవమ్మ బస్తీ, సంజయ్‌పురికాలనీ, జగద్గిరినగర్, బీరప్పనగర్‌లో పర్యటించారు. ప్రజలు అందించిన అఖండ విజయంతో మరింత బాధ్యతగా పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, శ్రీనివాస్, వీరాచారి, మల్లేష్‌గౌడ్, ప్రవీణ్ గుప్తా, ఇందిరాగౌడ్, సుజాత, వేణుయాదవ్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

'క్రీడలతో మానసికోల్లాసం'

షాపూర్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్ షాపూర్‌నగర్‌లోని పూర్ణిమ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్‌ను ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గురువారం ప్రారంభించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. కుత్బుల్లాపూర్ టీఆర్ఎస్ఎంఏ చైర్మన్ జానకిరాములు, కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు భాస్కర్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రత


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రతి కాలనీలో సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భద్రత పటిష్ఠమవుతోందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ నవోదయకాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీలో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన కాలనీ అసోసియేషన్ సభ్యులను, స్థానికులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీ అసోసియేషన్లు ముందుకొచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు రామకృష్ణగౌడ్, శర్మ, సంతోష్‌రావు, కాశినాత్‌యాదవ్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు బీవీ రమణ, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, సెక్రటరీ సిద్ధార్థ, గణేష్, లక్ష్మణ్, శివశంకర్, మదన్, శ్రీనివాస్, భార్గవ్, కిషోర్‌రెడ్డి, శ్రీకాంత్, పల్లాల్‌రాజు, సంతోష్, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

'మౌలిక వసతుల కల్పనకు కృషి'

గచ్చిబౌలి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని సెంట్రల్ పార్కు ఫేజ్-2 కాలనీలో కోటి రూపాయలతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ప్రసాద్, రామకృష్ణారెడ్డి, భూపాల్‌యాదవ్, సెంట్రల్‌పార్కు కాలనీ సభ్యులు, భాస్కర్ రెడ్డి, రాంబాబురావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువత దేశానికి వెన్నెముక

- బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీశైలంగౌడ్

జీడిమెట్ల, జనవరి 25(ఆంధ్రజ్యోతి): యువత దేశానికి వెన్నెముక అని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో ఐడీపీఎల్ జైకన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన నమో నవమత్ దాత సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగాన్ని మొద టి సారి ఓటర్లతో కలిసి వర్చువల్‌గా శ్రీశైలంగౌడ్ వీక్షించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబో ఎన్నికల్లో ప్రజా పాలనకు ఓటేసి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ సాయిరాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'ఓటు హక్కు విలువైనది'

కూకట్‌పల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటు హక్కును వినియోగించుకోవాలని కూకట్‌పల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.అలివేలు మంగమ్మ తెలిపారు. జాతీయ ఓటురు దినోత్సవం సందర్భంగా గురువారం కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం ఓటు హక్కుపై అధ్యాపకులు, విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. భారత రాజ్యాంగంపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవికుమార్, కె.సాలయ్య, వాణి, కరుణ, శోభారాణి, ఎం.మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

'పనుల్లో నాణ్యత పాటించాలి'

గాజులరామారం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు నాణ్యతతో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని కార్పొరేటర్ రావుల శేష గిరి అన్నారు. డివిజన్‌లోని వేణిఎన్ క్లేవ్‌లో నాయకులతో కలిసి యూజీడీ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నవాబ్ భాయ్, కాలనీ ప్రెసిడెంట్ రంగారావు, సభ్యులు హుస్సేన్, గంగాధర్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

చందానగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అపస్మార స్థితిలో ఉన్న వ్యక్తిని పోలీసులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్టు చందానగర్ పోలీసులు తెలిపారు. ఈనెల 21న చందానగర్ హుడాకాలనీ లక్ష్మీగణపతి ఆలయం వద్ద గుర్తుతెలియని వ్యక్తి(35) పడివున్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడి వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని చికిత్స నిమిత్తం 108లో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు ఎస్ఐలు బదిలీ

హైదర్‌నగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో ముగ్గురు ఎస్ఐలు బదిలీ అయ్యారు. సైబరాబాద్ కమిషనర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఐలు సంగమేశ్వర్, సురేందర్‌రెడ్డి, వినయ్‌ను వేర్వేరు విభాగాలకు బదిలీ చేశారు. వీరి స్థానంలో బాలానగర్ సీసీఎస్‌లో పనిచేస్తున్న సత్యకుమార్, ఎయిర్‌పోర్టు పీఎస్‌లో పనిచేస్తున్న సుమన్‌ను కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.